కాను. ఇప్పుడు నువ్వు వెనుకటిమాదిరిగా నా ఒళ్లో కూర్చుని నన్ను ముద్దుపెట్టుకోనిస్తే నాకు నీమీదగల మోహం కట్టలు తెగిపోతుంది. నేను వెర్రివాణ్ణయిపోయి నిన్నూ నన్నూ కూడా అపాయకరమైనస్థితిలోకి తెస్తాను. నీ బంధువులూ నా బంధువులూ తలలు పగలకొట్టుకోవలసి వస్తుంది!... ఇంతవిపులంగా ఇది నాచేత వప్పించి నీ పెంకెపట్టు సాధించావు. తృప్తి అయిందా ?"

రుక్మిణి నావంక ఒక్కక్షణం దీనంగా చూసింది.

"అప్పుడే నేనంత పెద్దదాన్నయినానా, నీకు ?... ఇంకేం అదే పాపిష్టిదాన్ని కావటమంటే ! నువ్వు కనుక్కోలేకపోయి నావు !" అన్నది రుక్మిణి.

రుక్మిణి అన్నమాటలో నిజంలేదా ?

## ౭. అనంతం

అనంతపథాన ఇద్దరు సూక్ష్మ జీవులు కలుసుకున్నారు. అదొక అపూర్వ సంఘటన.

ఆఇద్దరూ ఒకప్పుడు భౌతిక శరీరాలు ధరించి ద్వంద్వా లకు లోబడిన వారే. ఇద్దరూ వారివారి జీవితాలలో అసా మాన్య వ్యక్తులే. ఒకడి జీవితం భూగోళంమీద గడిచి పోయింది. మరొకడు బతికిఉండగా అంగారక గ్రహవాసి.

ఇప్పుడిద్దరికీ విముక్తి కలిగింది. ఇప్పుడు వారికి బ్రహ్మాండంలో పోరానిచోటు లేదు తెలియరాని విషయం లేదు. మన మానవుల దృష్టిలో వారు కాలాన్నీ దూరాన్నీ జయించిన వారే. వారు జయించలేని కాలమూ దూరమూ మనము ఊహించుకోనైనా లేము.

వారు కలుసుకున్న ప్రదేశం భూమీ అంగారకుడూ సూర్యుడి చుట్టూ సంచరించే మార్గాలకు మధ్యగా ఉంది. అక్కడ గాలిలేదు కనక అక్కణ్ణించి ఆకాశం నీలంగా కనిపించక కాటుక రంగుగా కనిపిస్తున్నది. అక్కడ రాత్రింబగళ్ళు లేవు. ఎల్లప్పుడూ తారాగణమూ గ్రహాలూ స్ఫుటంగా కనిపిస్తున్నవి. తారలు మినుకుమినుకు మనకుండా నిలబడి వెలుగుతున్నవి. అక్కడకి భూమిసగం మాత్రమే కనిపిస్తున్నది. అంగారక గ్రహం మాత్రం మూడువంతులకు పైగా కనిపిస్తున్నది. గ్రహాలు సూర్యకాంతికి ఎదురుగా పోతున్నప్పుడు సూర్యకిరణాల తాలూకు అలల్లో కలుగుతున్న సంక్షోభం వారి సూక్ష్మనేత్రాలకు కనిపించటమే కాక ఆనందంకూడా చేకూర్చుతున్నది.

"ఏమి ఈసృష్టి సౌందర్యం!" అన్నాడు మానవుడు, చుట్టూ కలయజూస్తూ. "నాకు విముక్తి కలిగిన క్షణంనించీ దీన్ని తనివిదీర ఆనందిస్తున్నాను-ఈపర్మాణాన్ని. ఈవింత నాకు విసుకు కలిగించలేదు. ఇట్లా అనంతకాలం జరిగిపోయినా నాకు తృప్తే!"

మానవుడు నోరు తెరిచిన క్షణంనించీ కనిబొమలు ముడేసి అతని వంక అర్థంకాని వాడల్లే చూస్తున్న ఆంగార కేయుడు పక్కున నవ్వాడు.

"ఇందులో వింతఏమిటి, వత్సా?" అన్నాడావృద్ధు.

"అంతా లెక్కప్రకారం జరిగి తీరవలిసిందే. నువ్వు గణిత జ్ఞుడివి కావల్లేవుంది. మామండలంలో మేమంతా కాలత గాళ్ళమే."

"కాలతగాళ్లనగా? ... మీరంతా శాస్త్రజ్ఞులని విన్నామే!"

"శాస్త్రమా? మాది మొదటినించి వచిరవరకూ కాలతశాస్త్రమే. వ్యక్తిని చెయ్యగానే—"

"మీరు వ్యక్తులను చేస్తారా?"

"లేకపోతే ఎట్లా? ఎప్పుడైనా ప్రమాదంజరిగితే జన సంఖ్య తక్కువయిపోదూ? నామటుకు నేను ప్రమాదం వల్లనే విముక్తిపొందాను నేనుపోగానే మా జనసంఖ్య తొమ్మిది తొమ్మిది తొమ్ముదులలో ఒకటి తగ్గిపోలేదా?"

"తొమ్మిదిసంఖ్య ఏమిటి?"

"మీరు తొమ్మిదిబొట్లతో తొమ్మిదిమీద మరొక సంఖ్య (మానవభాషలో పది) చేసుకున్నారు. మేము సున్నాను సంఖ్యగావాడము. అట్లావాడితే మా గణితమంతా తారుమారవుతుంది... నేను చెబుతున్నట్లు నేను విముక్తిచెందగానే మావాళ్ళు మరొకర్ని చేసుకుంటారు. ఒక యంత్రం తక్కువ అయినా మా పని ఆగిపోతుంది."

"యంత్రమా?" అన్నాడు మానవుడు నిర్ఘాంతపోయి.

"అవును. మనమంతా ఏమిటి? యంత్రాలం కామా?"

"చాలా చిత్రంగా ఉంది. యంత్రంలో ఆత్మ ఉంటుందా? మనలో యంత్రంమాత్రమేకాక ఆత్మకూడా లేదా?"

ఈసారి నిర్ఘాంతపోవటం అంగారకేయుడి వంతు.

"ఆత్మ—అంటే?"

"భౌతిక స్వరూపంలేనిది. జీవినించి భౌతికపదార్థం యావత్తూ రాలిపోయినతరవాత మిగిలేది."

"అటువంటిదేమీ లేదు!" అన్నాడు అంగారకేయుడు గట్టిగా. "ఉంటే నా లెక్కలన్నీ తప్పుపోవలిసిందే!"

"జడశరీరం విసర్జించి ఈ సూక్ష్మశరీరం ధరించిన మీరు కూడా ఆత్మలేదంటే నేనేం చెప్పనూ?"

వృద్ధు నవ్వాడు.

"ఇదా నువ్వు గ్రహించింది? నీ జడశరీరం ఎప్పుడయితే నిర్మించబడిందో దానివెంట—ఈ సూక్ష్మశరీరమే కాదు—ఇంతకంటె సూక్ష్మపదార్థసహితములైన శరీరములూ అప్పుడే నిర్మాణమయినై. అవి ఒకదానికంటె ఆలస్యంగా మరొకటి గాలిపోతై. ఏమీ మిగలదు. నాకు ఆ శరీరపదార్థాల తాలూకు లెక్కలన్నీ కరతలామలకమే. ఒక్కక్షణంలో నీకు అదంతా బోధపరుస్తాను!"

"క్షమించండి!" అన్నాడు మానవుడు కంగారుపడి. అతనికి ఇంటెగ్రల్ కాల్క్యులస్ జ్ఞాపకం చేసుకోవాలనే ఇచ్ఛ ఎంతమాత్రమూ లేదు. "అయితే ఒకటి చెప్పండి. ఆసూర్యుణ్ణి చూడండి. ఆసూర్యగోళంలో జీవితం సాధ్యమా? ఒకప్పుడు

మీగోళమూ మాగోళమూ అట్లాగే ప్రజ్వలిస్తూ ఉండేవని ఒప్పుకుంటారా? అటువంటిచోట జీవంఅనేది బయలుదేరింది. అటు చంద్రమండలంవంక చూడండి. అక్కడ ఇప్పుడు జీవితం అసంభవం — మర్త్యులమాట చెప్తున్నాను సుమండీ. అక్కడ ఒకప్పుడు ప్రాణుండి ఉండవచ్చును. ఒక గోళం చల్లారటం మొదలుపెట్టి పూర్తిగా చప్పబడి పొయ్యేలోపల ఆగోళంమీదికివచ్చి పొయ్యేప్రాణం అనేది దేవుడనేజ్యోతి తాలూకు రవ్వ అంటారా కాదంటారా?"

"ఉండు, ఉండు! నాకు బొత్తిగా అర్థంచేసుకోటానికి వీలులేనిమాటలు బోలెడన్ని ఉపయోగించావు. ప్రాణం ఏమిటి? దేవుడేమిటి? అసలునువ్వు మాట్లాడుతున్నది దేన్ని గురించీ?" అన్నాడు వృద్ధు.

దేవుడంటే తెలియకపోతేమాన ప్రాణం అంటేనూ ప్రాణి అంటేనూ తెలియదా? ప్రాణం అంటే చైతన్యానికి కారణభూతమయింది. ప్రాణి అంటే ప్రాణంతో కూడుకున్న యంత్రం — మీమాటే ఉపయోగింతాం!"

"చైతన్యానికి కారణభూతమయినది శక్తి. ఆశక్తి కరిగిన లోహంలో ఉన్నంతా ఘనీభవించిన లోహంలో ఉంది— ఇంచుమించుగా... నీసందేహం ఏమిటీ?"

ఆముసలివాడితో వాదించటం చాలా కష్టమని కనుక్కోటం మొదలుపెట్టాడు మానవుడు. కాని ఇంకా కొంచెం ప్రయత్నించి చూతామనుకున్నాడు.

"మీగోళంమీద వ్యక్తులున్నారాలేరా? అటువంటి వ్యక్తులు చంద్రమండలంలో లేరేం?"